# పరాయి సిరా

అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



**చిన్నమాట**

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950-ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# కోతి పాదం

(రచన: డబ్ల్యు డబ్ల్యు జేకబ్స్)

**బ్రిటన్‌లోని ఆ** చిన్న గ్రామంలో రైల్వే స్టేషన్‌కి సమీపంలో రెండే ఇళ్ళున్నాయి. కాబట్టి మట్టి రోడ్ మాత్రమే ఉంది. ఆ చలి రాత్రి ఓ ఇంట్లో ముందు గదిలోని ఫైర్ ప్లేస్‌లో కట్టెలు మండుతున్నాయి. కిటికీ తెరలన్నీ వేసి ఉన్నాయి. తండ్రి వైట్, కొడుకు హెర్బర్ట్ చదరంగం ఆడుతున్నారు. మిసెస్ వైట్ ఫైర్ ప్లేస్ పక్కనే ఉన్న సోఫాలో భర్తకి వేస్ట్‌ని అల్లుతోంది.

"జాగ్రత్త" ఆ ఆటని గమనించే మిసెస్ వైట్ హెచ్చరించింది.

ఆయనకి పావుని కదిపాక కాని చదరంగంలో తను చేసిన పొరబాటు అర్ధంకాలేదు. హెర్బర్ట్ తన వంతు రాగానే బోర్డ్‌ని పరిశీలనగా చూసి తన పావుని కదిపి చెప్పాడు.

"చెక్."

ఆయన తను ఎలా తప్పించుకోవాలా అని బోర్డ్‌లోని పావులని జాగ్రత్తగా పరిశీలిస్తూంటే బయటనించి అడుగుల చప్పుడు వినిపించింది.

"మీ ఫ్రెండ్ వచ్చినట్లున్నాడు నాన్నా" హెర్బర్ట్ చెప్పాడు.

వైట్ లేచి వెళ్ళి తలుపు తెరిచాడు. బయట నిలబడ్డ తన చిరకాల మిత్రుడు సార్జెంట్ - మేజర్ మోరిస్‌ని గుర్తుపట్టి వైట్ ఆనందంగా ఆహ్వానించాడు.

"నేను ఇటు రావడం తటస్థించింది. నేను వెళ్ళే రైల్వే స్టేషన్ దగ్గర్లోనే మీ ఇల్లుందని గుర్తొచ్చి ఫోన్ చేసాను లక్కీగా మీరింకా ఇక్కడే ఉన్నారు" మోరిస్ పొగాకుని తీసి చుట్టగా చుడుతూ చెప్పాడు.

వైట్ ఆయన్ని తన భార్య, కొడుకులకి పరిచయం చేసాడు.

"మోరిస్ ఇండియన్ ఆర్మీలో పనిచేసాడు" వైట్ చెప్పాడు.

"ఓ! ఐతే నాకు మీ సాహసాలు, అనుభవాలు చెప్పండి" హెర్బర్ట్ ఉత్సాహంగా అడిగాడు.

మోరిస్ మూడు గ్లాసులదాకా సైనికుడిగా తన ఇరవై ఒక్క ఏళ్ళ అనుభవాలని చెప్పాడు. వింత మనుషులు, వింత నేరాల గురించి.

"నువ్వో ఉత్తరంలో కోతి పాదం గురించి రాసావు. అది చెప్పు" వైట్ అతని గ్లాస్‌లో మళ్ళీ విస్కీని నింపి సూచించాడు.

మేజర్ మోరిస్ జేబులు తడుముకుని ఎండిపోయిన ఓ కోతిపాదాన్ని తీసి చూపించి చెప్పాడు.

"ఇది ఇండియాలో నాకు ఎవరో ఇచ్చారు. వారి మతంలో కోతులు ప్రధాన పాత్ర వహించాయి. ఇది మహత్తుగల కోతిదట.

దాన్ని చూడగానే మిసెస్ వైట్ కొద్దిగా వెనక్కి జరిగితే, ఆవిడ కొడుకు హెర్బర్ట్ ముందుకి వంగి దాని వంక ఆసక్తిగా చూసాడు. వైట్ దాన్ని చేతిలోకి తీసుకుని చూసి, బల్లమీద ఉంచి అడిగాడు.

"దీని ప్రత్యేకత ఏమిటి?"

"ఓ ముసలి హిందూ సన్యాసి దీన్ని నాకు ఇచ్చాడు. వారి మతంలోని ఓ అంశాన్ని చెప్పాడు. మనుషుల జీవితాలు వారి విధి ప్రకారం సాగుతాయని, ఎవరైనా వాటిలో జోక్యం చేసుకుంటే బాధపడతారని చెప్పాడు. ఇక దీని మహత్తు. ఇది వారి కోతి దేవుడి గుడి బయట నివశించిన కోతి. దీని పాదాన్ని ఎవరైనా మూడు కోరికలు కోరచ్చు. వాటిని అది తీరుస్తుంది."

"ఛీ! ఊర్కోండి" మిసెస్ వైట్ ఫక్కున నవ్వి చెప్పింది.

"అవును. ఆ ముసలి సన్యాసి మిమ్మల్ని మూర్ఖుడ్ని చేసినట్లున్నాడు" హెర్బర్ట్ కూడా చెప్పాడు.

"అతను చెప్పిందాంట్లో నిజం ఉండి ఉండచ్చు. మీరు మూడు కోరికలని కోరారా?" వైట్ మోరిస్‌ని అడిగాడు.

మోరిస్ హెర్బర్ట్ వంక కొన్ని క్షణాలు నిశితంగా చూసి జవాబు చెప్పాడు.

"కోరాను."

"అవి సఫలమయ్యాయా?" మిసెస్ వైట్ అల్లడం ఆపి ఆసక్తిగా అడిగింది.

"తీరాయి."

"ఇంకెవరైనా కూడా దీన్ని మూడు కోరికలు కోరారా?" ఆవిడ మళ్ళీ అడిగింది.

"ఇంకొకతను అడిగాడు. అతని రెండు కోరికలు ఏమిటో నాకు తెలియదు కానీ మూడో కోరిక చావుకి సంబంధించింది అని నాకు తెలుసు. ఈ కోతి పాదం అతని ద్వారానే నా చేతికి వచ్చింది."

"మీ మూడు కోరికలు తీరాక ఇంకా దీన్ని మీ దగ్గర ఎందుకు ఉంచుకున్నారు?" వైట్ అడిగాడు.

"సరదాకి అనుకుంటాను."

"మీరు ఇంకో మూడు కోరికలు కోరేట్టైతే అవీ తీరతాయా?" హెర్బర్ట్ ప్రశ్నించాడు.

"నేను మళ్ళీ కోరలేదు కాబట్టి నాకు తెలీదు. ఎవరైనా దీన్ని మూడు కోరికలు మించి కోరాలనుకుంటారని నేను అనుకోను."

మోరిస్ దాని వంక కొద్ది క్షణాలు చూసాక తల అడ్డంగా ఊపి దాన్ని నిప్పుల్లోకి విసిరేసాడు.

వైట్ చిన్నగా కేకపెడుతూ లేచి దాన్ని బయటకి తీసాడు.

"కాలిపోనీ. అది అందరికీ మంచిది" మోరిస్ గంభీరంగా చెప్పాడు.

"నీకు ఇది వద్దనుకుంటే నాకు ఇవ్వు" ఆయన కోరాడు.

"ఇవ్వను. దాన్ని నేను నిప్పులోకి అందుకే పడేసాను. దాన్ని నువ్వు నీ దగ్గర ఉంచుకుంటే ఏదైనా కోరక మానవు. తర్వాత జరిగేదానికి ఎవరూ నన్ను నిందించకూడదు. నువ్వు తెలివిగలవాడివైతే దాన్ని నిప్పుల్లో పడేయ్"

వైట్ తల అడ్డంగా ఊపి, తన చేతిలోని దాన్ని పరిశీలించాక అడిగాడు.

"ఎలా కోరాలి?"

"చేతిలో ఉంచుకుని దానివంక చూస్తూ బయటకి కోరు. కాని తర్వాత ఏదైనా చెడు జరగవచ్చని హెచ్చరిస్తున్నాను. కారణం ఇతరుల విధిలో వేలు పెట్టడమే" మోరిస్ గట్టిగా చెప్పాడు.

"మీరు చెప్పింది అరేబియన్ నైట్స్ కథలా ఉంది" మిసెస్ వైట్ నవ్వుతూ చెప్పింది.

ఆవిడ అందరికీ భోజనం వడ్డించడానికి లేచింది.

"నాకు సహాయం చేయడానికి ఇంకో రెండు చేతులు కావాలి. అది కోరచ్చుగా?" ఆవిడ నవ్వుతూ భర్తకి సూచించింది.

వైట్ ఆ కోతి పాదాన్ని చూస్తూంటే మోరిస్ చెప్పాడు.

"కోరదలచుకుంటే ఏదైనా తెలివైంది కోరు."

"తెలివైందంటే?" హెర్బర్ట్ అడిగాడు.

"ఎవరి విధికి సంబంధం లేనిది. రెండు చేతులు కోరడం వాటి యజమాని విధిని మార్చడమే అవుతుంది."

మిసెస్ వైట్ అందరికీ భోజనం వడ్డించింది. అంతా భోజనం అయేదాకా ఆ కోతి పాదాన్ని మర్చిపోయారు. మళ్ళీ అంతా కూర్చున్నాక ఆ మేజర్ తన కథలోని రెండో భాగాన్ని చెప్పసాగాడు. దాన్ని వారు ఆసక్తిగా విన్నారు. అతను తన చేతి గడియారం వంక చూసుకుని చెప్పాడు.

"నా రైలుకి టైమైంది."

వైట్ అతనితో బయటకి వెళ్ళి సాగనంపాడు. తిరిగి వచ్చాక హెర్బర్ట్ తండ్రిని అడిగాడు.

"ఆయనకి ఎంతిచ్చావు?"

"తక్కువ మొత్తమే ఇచ్చాను."

"మీరు చక్రవర్తి అవాలని కోరుకోండి. అందువల్ల మీరు హెన్‌పెక్డ్ హజ్బెండ్ అవరు" అతను నవ్వుతూ సూచించాడు.

తల్లి కొడుకు వంక నిరసనగా చూసింది. వైట్ బల్ల మీది దాన్ని అందుకుని చూస్తూ చెప్పాడు.

"నాకు కావాల్సినదంతా నాకుంది. ఇంటి తనఖా తీరడమే మిగిలిన నా ఏకైక కోరిక."

"ఐతే రెండు వందల పౌన్లని కోరుకుంటున్నాను" వైట్ దానివంక చూస్తూ గట్టిగా చెప్పాడు.

వెంటనే వైట్ పెద్దగా అరవడంతో భార్య, కొడుకు ఆయన దగ్గరకి ఒక్క ఉదుటున వెళ్ళారు.

"ఏమైంది?" భయంతో వణికే భర్తని మిసెస్ వైట్ అడిగింది.

"ఇది కదిలింది. నా కోరిక వినగానే ఆ కోతి పాదం కదిలింది. నా అరచేతిలో పాములా కదిలింది."

చూస్తే అది అతని చేతిలో కాక నేల మీద ఉంది.

"నువ్వు కోరిన డబ్బేది? అది నాకు ఎక్కడా కనపడటం లేదు" చెప్పి హెర్బర్ట్ దాన్ని ఎత్తి మళ్ళీ బల్లమీద ఉంచాడు.

"మోరిస్ చెప్పినట్లు ఎలాంటి హానీ జరగలేదు కానీ అది కదలడం వల్ల నేను భయపడ్డాను అన్నది నిజం" వైట్ చెప్పాడు.

తండ్రీ కొడుకులు ఇద్దరూ నిప్పుకి దగ్గరగా జరిగి కూర్చున్నారు. గాలి వీచే శబ్దం పెరగడం వారికి వినిపించింది. మొదటి అంతస్థులో పడక గది తలుపు కొట్టుకునే శబ్దం విన్న వైట్ చెప్పాడు.

"సరే. ఇక పడుకుందాం."

"నీ మంచం మీద ఓ బుట్టలో ఆ డబ్బు కనిపిస్తుందనుకుంటాను. గుడ్‌నైట్" హెర్బర్ట్ తండ్రితో ఎగతాళిగా చెప్పాడు.

వైట్‌కి ఫైర్ ప్లేస్‌లోని నిప్పులో ఓ మొహం కనిపించింది. ఆయనకి అది భ్రమలా తోచలేదు. బల్లమీది నీళ్ళగ్లాస్‌ని తీసుకుని ఆ మొహం మీద చల్లాడు. తర్వాత భార్యతో కలిసి మెట్లెక్కి తమ పడకగదిలోకి వెళ్ళాడు.

మర్నాడు ఉదయం కుటుంబ సభ్యులు ముగ్గురూ బ్రేక్‌ఫాస్ట్ బల్లముందు కూర్చున్నారు. మిసెస్ వైట్ మేంటల్ పీస్ మీద ఆ కోతి పాదాన్ని చూసి చెప్పింది.

"వినే వాళ్ళుంటే చెప్పడానికి ముసలి సైనికుల దగ్గర ఇలాంటి చిత్ర విచిత్ర కథలు చాలా ఉంటాయి అనుకుంటాను. ఈ రోజుల్లో కోరిన కోరికలు మనుషులే తీర్చడం లేదు. ఒకవేళ తీర్చినా రెండు వందల పౌన్ల వల్ల మీకు ఎలాంటి హాని జరుగుతుంది?"

"ఒకవేళ జరిగినా అది మోరిస్ చెప్పినట్లు కాక కాకతాళీయంగా జరుగుతుంది" వైట్ చెప్పాడ్

హెర్బర్ బ్రేక్‌ఫాస్ తిన్నాక తల్లితండ్రులకి 'గుడ్‌బై' చెప్పి తలుపు తెరచుకుని బయటకి వెళ్ళాడు.

"నిన్న రాత్రి ఆ కోతి పాదం నీ చేతిలో కదిలిందన్నది భ్రమ" మిసెస్ వైట్ భర్తతో చెప్పింది.

"భ్రమ కాదు. అది నిజంగా కదిలింది."

"నిర్జీవమైన అది ఎలా కదులుతుంది?"

"అందుకే భయం వేసి అరిచాను."

వాళ్ళిద్దరూ ఆ విషయం మీద కొద్దిసేపు వాదన పడ్డాక వైట్ నవ్వుతూ చెప్పాడు.

"నేను చక్రవర్తిని అవ్వాలని కోరుకుని ఉంటే నాకీ గయ్యాళి భార్య ఉండేది కాదు."

ఆవిడ దృష్టి కిటికీలోంచి ఇంటి గేట్ బయట నిలబడ్డ ఓ మనిషి మీద పడింది. అతను ఇంటిముందు నిలబడి లోపలికి  రావాలా, వద్దా అనే మీ మాంసంలో ఉన్నట్లుగా గేట్ నించి దూరంగా వెళ్ళి మళ్ళీ తిరిగి రావడం చూసింది. చివరికి అతను గేట్ తెరుచుకుని లోపలకి వచ్చాడు. మిసెస్ వైట్ తను కట్టుకున్న ఏప్రన్‌ని విప్పి, తలుపు తెరిచింది. సందేహించే, ఆ కొత్త వ్యక్తిని చిరునవ్వుతో లోపలకి ఆహ్వానించింది. అతను కూర్చుని కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉన్నాక పేంట్ జేబులోంచి ఓ కవర్ని తీసి చెప్పాడు.

"నేను మా అండ్ మేగన్స్ నించి వస్తున్నాను. హెర్బర్ట్ మీ అబ్బాయేనా?"

"అవును. వాడికేం కాలేదుగా?" మిసెస్ వైట్ వెంటనే అడిగింది.

"అతను చెడ్డ వార్తతో రాలేదని నా నమ్మకం" వైట్ సందేహిస్తూనే చెప్పాడు.

"కాదు. హెర్బర్ట్‌కి ప్రమాదం జరిగి తీవ్రమైన దెబ్బలు తగిలాయి. కనీ అతను ఎలాంటి బాధా పడటంలేదు" ఆ కొత్తవ్యక్తి చెప్పాడు.

"థాంక్ హెవెన్స్" ఆవిడ రెండు అరచేతులు పట్టుకుని చెప్పింది.

అంతలోనే ఆ మాటలు అర్థం స్ఫురించగానే అడిగింది.

"అసలేం జరిగిందో చెప్పండి."

"మీ అబ్బాయి తను పని చేసే మా కంపెనీ ఫేక్టరీ యంత్రంలో చిక్కుకున్నాడు."

"ఏమిటి? మాకున్నది వాడొక్కడే ఇది చాలా కష్టం." వైట్ ఏడుపు గొంతుతో చెప్పాడు.

"మా అండ్ మేగన్స్ సంస్థ మీకు తమ సానుభూతిని తెలియచేయమంది. నేను వారి ఉద్యోగిని మాత్రమే."

ఆ ముసలావిడ వంక తెల్లబోతూ చూస్తూండిపోయింది.

"మా అండ్ మేగన్స్‌కి ఇందులో తమ బాధ్యత లేదని చెప్పమన్నారు. ఆ మెషీన్‌ని ఎలా ఆపరేట్ చేయాలో వివరించే బోర్డ్ ఎదురుగానే ఉంది. కానీ మీ కొడుకు ఇన్ని సంవత్సరాలుగా చేసిన సేవకి నష్టపరిహారంగా లేదా కృతజ్ఞతగా మీకు కొంత డబ్బు ఇవ్వాలనుకున్నారు" అతను విచారంగా చెప్పాడు.

"ఎంత?" వైట్ భయంగా అడిగాడు.

"రెండు వందల పౌన్లు" అతను తనతో తెచ్చిన కవర్ని ఇస్తూ చెప్పాడు.

ఆ సమాధానం వినగానే మిసెస్ వైట్ పెద్దగా అరిచింది. వైట్ నిలబడలేక నేలకూలాడు.

ఇంటికి రెండు మైళ్ళ దూరంలోని సెమెట్రీలో వారు తమ కొడుకుని సమాధి చేసాక ఇంటికి తిరిగి వచ్చారు. అదంతా ఎంత అకస్మాత్తుగా జరిగిందంటే, వాళ్ళు పొందాల్సిన విచారాన్ని మొత్తం వెంటనే పొందలేకపోయారు.

దాదాపు వారం తర్వాత ఓ రాత్రి వైట్‌కి మెలుకువ వచ్చి చూస్తే భార్య పక్కన లేదు. కిటికీ దగ్గరనించి ఆవిడ ఏడుపు వినిపించింది.

"రా. అక్కడ చలిగా ఉంటుంది" చెప్పాడు.

"మనబ్బాయికి అక్కడ ఇంకా చల్లగా ఉంటుంది" ఆవిడ ఏడుస్తూ చెప్పింది.

ఆయన ఆ వేడి మంచంలో మళ్ళీ నిద్రలోకి జారిపోయాడు.

అకస్మాత్తుగా భార్య అరుపుకి మళ్ళీ మెలుకువ వచ్చింది.

"పాదం.. కోతి పాదం" మిసెస్ వైట్ అరిచింది.

"ఎక్కడ? ఏమైంది?" ఆయన లేచి కూర్చుని అడిగాడు.

"దాన్ని నువ్వు నిప్పుల్లో పడేయలేదు కదా?"

"లేదు మేంటెల్‌పీస్ మీద పెట్టెలో పెట్టాను."

"మంచి పని చేసావు. నాకు ఇప్పుడే ఆ ఆలోచన వచ్చింది. నీకెందుకు రాలేదు" అడిగింది.

"ఏ ఆలోచన?"

"మిగిలిన రెండు కోరికలు. మనం ఒకటే కోరుకున్నాం."

"అదొక్కటీ చాలదా?" ఆయన బాధగా చెప్పాడు.

"లేదు. ఇంకో కోరిక కోరుకుందాం. మనబ్బాయి తిరిగి జీవించాలని కోరుకుందాం."

"గుడ్ హెవెన్స్ నీకు పిచ్చెక్కింది" వైట్ అరిచాడు.

"వెళ్ళి తీసుకురా."

"పడుకో. నువ్వేం అంటున్నావో నీకు తెలీడంలేదు" కోపంగా అరిచాడు.

"మన మొదటి కోరిక తీరింది. రెండోది ఎందుకు తీరదు?"

"అది కాకతాళీయంగా జరిగింది" వైట్ గొణిగాడు.

"వెళ్ళి దాన్ని తీసుకురా"

"వాడు పోయి పదిరోజులైంది. వాడు బతికొచ్చినా వాడిని చూడటం కష్టం. దుస్తుల్ని బట్టే వాడిని మనం గుర్తించగలగాలి." ఆయన అనునయంగా చెప్పాడు.

"నేను పాలిచ్చి పెంచిన కొడుకుని చూసి భయపడతాను అనుకున్నావా?"

ఆవిడ ఉద్వేగంగా భర్త చేతిని పట్టుకుని పడక గదిలోంచి ముందు గదిలోకి లాక్కెళ్ళింది. మేంటెల్ పీస్ మీద ఆ కోతి పాదం ఉంచిన చోటే ఉంది.

"కోరు. వాడు బతికి రావాలని కోరు" మిసెస్ వైట్ ఆజ్ఞాపించింది.

"ఇది బుద్ధిలేని కోరిక."

"కోరు" ఆవిడ మళ్ళీ అరిచింది.

ఆయన తన చేతిని పైకెత్తి కోతి పాదం వంక చూస్తూ చెప్పాడు.

"నా కొడుకు మళ్ళీ బతకాలన్నది నా రెండో కోరిక."

తక్షణం అది పైనించి నేలమీదకి పడింది. ఆయన భయంతో కుర్చీలో కూలబడితే ఆ వృద్ధురాలు కిటికీ దగ్గరకి వెళ్ళి తెరని తొలగించి బయటకి చూడసాగింది. ఆయన మధ్య మధ్యలో బయటకి చూసే తన భార్య వంక చూస్తూ వణుకుతూ కూర్చున్నాడు. తన కోరికని కోతి పాదం తీర్చలేదనుకుని ఆయన లేచి మెట్లెక్కి పడకగదిలోకి వెళ్ళాడు. రెండు నిమిషాల తర్వాత భార్య కూడా నిశ్శబ్దంగా వచ్చింది. ఒకరితో మరొకరు మాట్లాడుకోలేదు. ఇద్దరూ గోడగడియారం చేసే చప్పుడుని వినసాగారు. మెట్లమీద చప్పుడు వినిపించింది. ఓ ఎలుక అరుపు కూడా.

కాసేపటికి తలుపు మీద కొట్టిన శబ్దం వినిపించింది. ఆయన లేచి అగ్గిపుల్ల గీసి ధైర్యాన్ని కూడగట్టుకుని ఆ వెలుగులో మెట్లమీద కిందకి నడిచాడు. మరోసారి తలుపు మీద కొట్టిన చప్పుడు వినిపించింది. వైట్ మెట్లెక్కి గబగబా పడక గదిలోకి వెళ్ళి తలుపు మూసి లోపల గడియ పెట్టాడు. మూడోసారి మళ్ళీ తలుపు శబ్దం వినిపించింది.

"ఏమిటా చప్పుడు?" మెలుకువ వచ్చిన మిసెస్ వైట్ లేచి కూర్చుని అడిగింది.

"ఓ ఎలుక మెట్ల మీద నా పక్కనించి వెళ్ళింది" వణికే స్వరంతో వైట్ చెప్పాడు.

ఇంకోసాఇర్ తలుపు మీద కొట్టిన శబ్దం విన్నాక ఆవిడ ఆనందంగా, దుఃఖంగా చెప్పింది.

"హెర్బర్ట్! మన హెర్బర్ట్ వచ్చాడు."

ఆవిడ తలుపువైపు పరిగెత్తింది. ఆయన ఆవిడ చేతిని గట్టిగా పట్టుకుని ఆపి అడిగాడు.

"నువ్వేం చేస్తున్నావు?"

"వచ్చింది హెర్బర్ట్. నా కొడుకు" వాడు రెండు మైళ్ళ దూరం నించి రావాలన్న సంగతి మర్చిపోయాను. నన్ను వెళ్ళనీ."

"ఒద్దొద్దు. వాడిని లోపలికి రానీక" వైట్ అర్థించాడు.

"నీ కొడుకంటే నీకు భయమా? నాకు లేదు. నన్ను వెళ్ళనీ."

మరోసారి, ఇంకోసారి తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. చివరికి ఆవిడ వైట్ పట్టునించి తప్పించుకుని కిందకి పరిగెత్తింది. వైట్ ఆవిడ వెంటనే వెళ్తూ బతిమాలుతూ చెప్పాడు.

"ఒద్దు. ఇంకో ప్రమాదం పొంచి ఉండచ్చు."

తలుపుకున్న ఇనప చెయిన్ తీసిన శబ్దం వినిపించింది.

"పై గడియ రావడంలేదు. వచ్చి తియ్యి" భార్య ఆయన వంక చూస్తూ అరిచింది.

ఆయన చేతులు చీకట్లో కోతి పాదం కోసం నేలమీద తడమసాగాయి. బయట ఉన్నవారు లోపలకి వచ్చేలోగా తను దాన్ని నిప్పుల్లో వేయగలిగితే అనే ఆలోచన కలిగింది. భార్య కుర్చీని తలుపు దగ్గరకి లాగిన శబ్దం వినిపించింది. ఆమె దాని మీదకి ఎక్కి టవర్ బోల్ట్‌ని తీసే ప్రయత్నం చేస్తోందని గ్రహించాడు. ఆయనకా క్షణం కోతి పాదం దొరికింది. ఆయన ఆఖరి కోరికని కోరాడు.

"నా మూడో కోరిక మా అబ్బాయి హెర్బర్ట్ జీవించకూడదు."

అకస్మాత్తుగా తలుపు కొట్టే శబ్దం ఆగిపోయింది. దాని ప్రతిధ్వని మాత్రం ఆ గదిలో ఉంది. కుర్చీ వెనక్కి లాగిన శబ్దం వినిపించింది. మిసెస్ వైట్ ఇంటి తలుపు తెరచింది. చల్లటిగాలి లోపలికి వచ్చింది. ఆవిడ దుఃఖంగా, పెద్దగా ఏడ్చే ఏడుపు ఆయనలో ధైర్యాన్ని నింపింది. ఆవిడ దగ్గరకి వెళ్ళి బయటకి చూసాడు. దీపస్థంభాల వెలుతురులో నిర్మానుష్యంగా ఉన్న వీధి కనిపించింది.

***(ఇది సెప్టెంబర్ 1902లో 'ది లేడీ ఆఫ్ ది బార్జ్' అనే కథాసంపుటిలో వచ్చిన బ్రిటిష్ కథ. దీని ఆధారంగా చాలా నాటకాలు, నవలలు, కామిక్స్, టివి డ్రామాలు, సినిమాలు, రేడియో నాటికలు, ఒపేరాలు వచ్చాయి.)***

**(వచ్చేనెల మరోకథ)**

Post your comments